
సాక్షి
సూర్యాపేట
గురువారం । 3 । ఆగస్టు । 2023



మూడు గేట్ల ద్వారా ..
మూసీ ప్రాజెక్టు నుంచి మూడు గేట్ల ద్వారా అధికారులు దిగువకు నీటిని వదులుతున్నారు.
- 10లో



యాదాద్రి పునర్నిర్మాణం అద్భుతం
యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్నిర్మాణం అద్భుతమని బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు అన్నారు.
- 10లో

గరిష్టం/కనిష్టం
31°/26°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోర్ట్‌పోలియో జడ్జిని కలిసిన బార్‌అసోసియేషన్ సభ్యులు



పోర్ట్ పోలియో జడ్జి శ్రీసుధను శాలువాతో సత్కరిస్తున్న న్యాయవాదులు

చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేట జిల్లాకు నూతనంగా నియామకమైన పోర్ట్ ఫోలియో,అడ్మినిస్ట్రేటివ్ జడ్జి పి.శ్రీసుధను బుధవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టులో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెను శాలువాతో సత్కరించారు. అనంతరం కోర్టు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలేబోయిన నర్సయ్య యాదవ్, కోశాధికారి రాచకొండ యాదగిరి, సీనియర్ న్యాయవాది ఎం.ఈశ్వర్ కుమార్, హైకోర్టు జీపీ పాటి నాగిరెడ్డి పాల్గొన్నారు.

9న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్



మంత్రిని ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

భానుపురి (సూర్యాపేట) : జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ సుమంగళి ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న గ్రౌండ్ లో ఈనెల 9వ తేదీన నల్లాన్ చక్రవర్తుల రామానుజాచార్యులు వెంకటరమణమ్మ స్మారకార్థం సూర్యాపేట జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు వేణుగోపాల చార్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ టోర్నీలో గెలిచిన వారికి మంత్రి చేతుల మీదుగా ట్రోఫీ, నగదు బహుమతి అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మురళీధరాచార్యులు, శ్రీనివాసాచార్యులు, సంకర్షణ ఆచార్యులు, శరశ్చంద్ర, హరి చరణ్, దారూరి రాఘవ, శ్రీనాథ్, రామానుజ, సంతోష్, ఉపేంద్ర ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అలుగు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం



చిలుకూరు మండలం బేతవోలు చెరువు అలుగును పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చిలుకూరు: చిలుకూరు మండలం బేతవోలులోని వీర్లదేవి చెరువు అలుగును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ నరసింహారావు, ఈఈ సత్యనారాయణ హెచ్చరించారు. బేతవోలులోని వీర్లదేవి చెరువు అలుగును కొందరు ఆక్రమణదారులు ధ్వంసం చేసిన విషయాన్ని 'బ్లాస్టింగ్‌తో చెరువు ధ్వంసం' అనే శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. ఆ చెరువును డీఈఈ స్వప్న, ఏఈఈ మానసలతో కలిసి పరిశీలించి మాట్లాడారు. చెరువు అలుగు ధ్వంసం విషయంలో అనుమానితులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అలుగుకు మరమ్మతులు చేస్తామన్నారు.

సమర్థ బోధనకు శిక్షణ అవసరం

తిరుమలగిరి, అర్వపల్లి: పాఠశాలల్లో సమర్థంగా బోధించాలంటే ఉపాధ్యాయులకు శిక్షణ అవసరమని జిల్లా విద్యాధికారి కె.అశోక్ అన్నారు. తొలిమెట్టుపై బుధవారం తిరుమలగిరి, అర్వపల్లిలో ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. తిరుమలగిరి బీసీ కాలనీ, అనంతారం, జలాల్‌పురం ప్రాథమిక పాఠశాలల్లో మన ఊరు–మన బడి పనులను పరిశీలించారు. శిక్షణలో ఎంఈఓలుశాంతయ్య, బాలునాయక్, హెచ్‌ఎంలు అశోక్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, అశోక్, ఆర్పీలు అశోక్‌రెడ్డి, బ్రహ్మం, అధికారులు ప్రసాద్, ప్రభాకర్, సీఎన్‌ఓలు తబిత, చాంప్లానాయక్, నారాయణ, వెంకన్న, డీఆర్పీ ప్రశాంతి, ఎమ్మార్పీలు సైదులు,నాగరాజు పాల్గొన్నారు.

అవార్డుకు అడ్డదారులు!

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మున్సిపాలిటీని ముందుంచేందుకు తాపత్రయం
- పట్టణంలోని పరిస్థితులపై ప్రజాభిప్రాయం సేకరించకుండానే సర్వే కొనసాగింపు
- టార్గెట్‌ల కోసం హడావుడి
- ప్రజల ఫోన్ నంబర్లు తెలుసుకుని స్వయంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది
- ఆ తర్వాత ఓటీపీపై ఆరా



సూర్యాపేట మున్సిపాలిటీలో సర్వే చేస్తున్న సిబ్బంది

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : స్వచ్ఛసర్వేక్షణ్‌లో మున్సిపాలిటీని ముందు వరుసలో నిలిపేందుకు సిబ్బంది తాపత్రయం అంతాఇంతా కాదు. మెరుగైన ర్యాంకు కోసం అడ్డదారులూ తొక్కుతున్నారు. పట్టణంలోని పరిస్థితులపై ఇంటింటికీ తిరిగి సర్వే చేయాల్సిన ఉన్నా.. ప్రజల ఫోన్ నంబర్లు అడిగి తామే స్వయంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఆ తర్వాత ఓటీపీపై ఆరా తీస్తున్నారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో ప్రస్తుతం సర్వే కొనసాగుతోంది. సర్వేతీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

మున్సిపాలిటీ	వార్డులు	జనాభా
సూర్యాపేట	48	1.90 లక్షలు
కోదాడ	38	లక్ష
హుజూర్‌నగర్	28	45 వేలు
తిరుమలగిరి	15	19 వేలు
నేరేడుచర్ల	15	20 వేలు

సర్వే ఎలా అంటే..

పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పం, ప్రజలకు పారిద్ధ్యంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య చర్యలు, కల్పిస్తున్న మౌలిక వసతులపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి అవార్డులు సైతం అందిస్తూ మున్సిపాలిటీలకు ర్యాంకులను కేటాయిస్తోంది. స్వచ్ఛ సర్వేక్షణ్ -2023 పోటీల్లో ముందంజలో నిలిచేందుకు సన్నద్ధమవుతున్నాయి. త్వరలో కేంద్ర బృందాలు పర్యటించి అవార్డులకు ఎంపిక చేయనున్న నేపథ్యంలో మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత ఏ విధంగా ఉంది అనేది తెలుసుకునేందుకు సర్వే చేపట్టారు. ఈనెల 15 నాటికి సర్వే ముగియనుంది. బిల్ కలెక్టర్, మెప్మా రిసోర్స్ పర్సన్లు ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాలు నమోదు చేయాల్సి ఉంది. మీ ఇంటి నుంచి నిత్యం చెత్త సేకరిస్తున్నారా? , మీ ఇంట్లో వ్యర్థాలను రోజువారీగా తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారా?, మీ ఇంటి పరిసరాల్లో మురుగు కాల్వలు పరిశుభ్రంగా ఉన్నాయా? , రెడ్యూస్ రీయూజ్ రీసైక్లింగ్ సెంటర్ గురించి మీకు తెలుసా?, కమ్యూనిటీ పబ్లిక్ టాయిలెట్లు పరిశుభ్రంగా నిర్వహిస్తున్నారా? , మీ పరిసరాల్లోని పరిశుభ్రతకు మీరు ఎలాంటి రేటింగ్ ఇస్తారు?, మీ పట్టణంలో పరిశుభ్రతకు మీరు ఎలాంటి రేటింగ్ ఇస్తారు? అనే అంశాలను ప్రజలను అడిగి వారు చెప్పే సమాధానం ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి. కానీ ఆ దిశగా సర్వే సాగడం లేదన్న విమర్శలున్నాయి. సర్వేకు కేటాయించిన సిబ్బంది పట్టణంలోని ప్రధాన వీధుల్లో నిలబడి 'మీ ఫోన్ నంబర్ చెప్పరా'.. అంటూ వచ్చిపోయే వారిని అడిగి పేరు నమోదు చేసుకొని వీలైతే అప్పుడే.. లేదా తరువాత అయినా వారే స్వయంగా వివరాలు నమోదు చేసి ఫోన్‌కు వచ్చిన ఓటీపీ అడిగితెలుసుకుంటున్నారు.

రోజుకు 50 మంది లక్ష్యం

ప్రతి మున్సిపాలిటీలో రోజుకూ కనీసం 50 మందితో సర్వే నిర్వహించాలని లక్ష్యం. కానీ టార్గెట్ కోసం సిబ్బంది తాపత్రయ పడుతున్నారు. ఇంటింటికీ వెళ్లి ఇంటి యజమాని స్మార్ట్ ఫోన్‌తో స్వచ్ఛ సర్వేక్షణ్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సర్వేలో ఉన్న ఏడు ప్రశ్నలకు సమాధానం రాబట్టాల్సిన వారే ఆ తతంగం కానిస్తున్నారు. చివరగా ఓటీపీ అడిగి సర్వే పూర్తి చేస్తున్నారు.

గ్రామాల్లో పనుల పరిశీలన



బీమ్లాతండాలో అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

చివ్వెంల(సూర్యాపేట) : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తున్న నేపథ్యంలో అదనపు కలెక్టర్ ప్రియాంక చివ్వెంల మండల పరిధిలోని బద్యాతండా, భీమ్లాతండా, రాజుతండా, పాండ్యానాయక్ తండాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ యాదయ్య, డీఎస్పీ నాగభూషణం, అటవీశాఖ అధికారి సతీష్, ఎంపీడీఓ లక్ష్మి, ఎంపీఓ గోపి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముందస్తుగానే మద్యం టెండర్

- ఉత్తర్వులు జారీ చేసిన ఎక్సైజ్‌శాఖ
- జిల్లాలో 99 మద్యం దుకాణాలు
- నేడు రిజర్వేషన్ షాపుల ఎంపిక
- 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- 18న గడువు ముగింపు.. 21న డ్రా



సూర్యాపేట: జిల్లాలో మద్యం దుకాణాల లైసెన్స్‌ల జారీకి రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. మద్యం దుకాణాల గడువు నవంబర్‌తో ముగియనుంది. మూడు నెలలు ముందుగానే టెండర్లకు నోటిఫికేషన్ జారీ చేసింది. 2023–25కుగాను జిల్లాలోని 99 మద్యం దుకాణాలకు ఈ నెల 4న గెజిట్ నోటిఫికేషన్ జారీ కానుంది. ఈ నెల 3న కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా ఎక్సైజ్ అధికారి, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల అధికారుల సమక్షంలో రిజర్వేషన్ గల మద్యం దుకాణాలను డ్రా పద్ధతిలో నిర్ధారించనున్నారు. 99 మద్యం షాపుల్లో గౌడ్‌లకు 27, ఎస్సీ 10, ఎస్టీ 3 ఇలా మొత్తం 40 షాపులను రిజర్వేషన్ పద్ధతిన ఎంపిక చేయనున్నారు. మిగిలిన 59 మద్యం షాపులను జనరల్ స్థానంగా కేటాయించారు. అయితే అన్ని షాపులకు రిజర్వేషన్ కేటగిరీలకు సంబంధించిన వారు టెండర్ వేయవచ్చు. డిసెంబర్ 1 నుంచి కొత్తషాపులు ప్రారంభించేందుకు టెండర్ నోటిఫికేషన్‌లు వేస్తున్నారు. ఈనెల 4నుంచి ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

డిసెంబర్ 1నుంచి నూతన మద్యం దుకాణాలు

ఈ నెల 4 నుంచి మద్యం దుకాణాల లైసెన్స్‌ల కోసం ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 6గంటల వరకు దరఖాస్తుల స్వీకరణకు చివరి గడువు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం టెండర్ దరఖాస్తులను అందజేయాలి. ఈ నెల 21న మద్యం టెండర్లను డ్రా ద్వారా ఎంపిక చేస్తారు. టెండర్ లభించిన వారు 21, 22 తేదీల్లో మొదటి దశ డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. టెండర్ పొందిన వారికి నవంబర్ 30న మద్యం సరఫరా చేస్తారు. డిసెంబర్ 1న నూ తన మద్యం షాపులు ప్రారంభించాల్సి ఉంటుంది.

దరఖాస్తు ఇలా...

మద్యం దుకాణాలకు టెండర్ వేసే అభ్యర్థులు దరఖాస్తు వెంట ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, రూ. 2లక్షలు డీడీ, చెక్కు జత చేయాలి. డిఫాల్టర్‌లు ఆర్థికంగా దివాళా తీసినవారు టెండర్‌కు అనర్హులు. 21 సంవత్సరాలు దాటినవారు మద్యం టెండర్ వేయాలి.

గతంలో రూ.40 కోట్ల ఆదాయం

2019–21లో 99 మద్యం షాపులకు టెండర్లు నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా 2వేల దరఖాస్తులు అందాయి. వీటి ద్వారానే రూ. 40కోట్ల పై చిలుకు ఆదాయం సమకూరింది. అత్యధికంగా జిల్లాలో జాన్‌పహాడ్, మేళ్లచెర్వు మద్యం దుకాణాలకు కోసం దరఖాస్తులు అందాయి. ఇప్పటికే రాష్ట్ర ఎక్సైజ్ కార్యాలయం నుంచి నేడే రేపో మద్యం దుకాణాల టెండర్ల నోటిఫికేషన్ విడుదల కావడంతో పాటు దరఖాస్తులు స్వీకరించడంతో ఆగస్టు 21న ప్రక్రియ పూర్తి చేసే విధంగా సిద్ధంకావాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో జిల్లాలో టెండర్ల ప్రక్రియకు సిబ్బంది అధికారులు కసరత్తు ప్రారంభించారు.

బదిలీపై వచ్చిన తహసీల్దార్లకు పోస్టింగ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చిన 12 మంది తహసీల్దార్‌లకు మండలాలను కేటాయిస్తూ బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎ. వెంకట్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న మరో ఐదురుగు తహసీల్దార్లకు స్థానచలనం కల్పించారు.

కేటాయించిన మండలాలు..

తహసీల్దార్ పేరు	మండలం	తహసీల్దార్ పేరు	మండలం
శ్యాంసుందర్‌రెడ్డి	జాజిరెడ్డిగూడెం	దేవదాసు	మఠంపల్లి
యాదగిరిరెడ్డి	తుంగతుర్తి	సాయిగౌడ్	కోదాడ
బ్రహ్మయ్య	నాగారం	షేక్ అహ్మద్	నేరేడుచర్ల
మహేందర్‌రెడ్డి	పెన్‌పహాడ్	సరిత	చిలుకూరు
నాగార్జున్‌రెడ్డి	హుజూర్‌నగర్	అర్చన	అనంతగిరి
క్రిష్ణయ్య	ఆత్మకూర్ (ఎస్)	జ్యోతి	మేళ్లచెరువు
శ్రీనివాస్‌రావు	నూతనకల్	ఎస్‌టీ ప్రకాష్	మోతె
శ్రీనివాస్‌రెడ్డి	గరిడేపల్లి	నారాయణ	ఆర్‌డీఓ కార్యాలయం, హుజూర్‌నగర్

జిల్లా ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది వేతనాలు పెంచాలి

సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ సిబ్బంది వేతనాలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ డిమాండ్ చేశారు. బుధవారంర జిల్లా కేంద్రంలోని వైద్యశాల సిబ్బంది గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. వీరికి పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రెడ్డికి నాలుగో తరగతి ఉద్యోగుల పట్ల జాలి కూడా లేదన్నారు. నాలుగు నెలల నుంచి పని లేక పస్తులుంటున్నారని ఎవరో చెప్పిన తప్పుడు సమాచారం ఆధారం చేసుకొని కార్మికుల కడుపులు కొట్టవద్దన్నారు. వెంటనే పనిలోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, పి. శ్రీనివాస్, నాగభూషణం, రవి, ప్రసాద్, రజియా, నీలమ్మ, శకుంతల, నాగరాణి, మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులతో జాగ్రత్త

- నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- 19ఏళ్లలోపు పిల్లలకు వేసేందుకు అధికారుల ఏర్పాట్లు
- అందుబాటులో 2.93లక్షల మాత్రలు



మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

హుజూర్‌నగర్: చిన్నపిల్లలు తరచూ కడుపునొప్పి, విరేచనాల బారిన పడుతుంటారు. దీనికి కారణం నులి పురుగులు. వీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు. వీటి నివారణకు గురువారం నుంచి ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు.

19 ఏళ్ల లోపు పిల్లలు 2.09 లక్షల మంది

జిల్లాలో 19 ఏళ్లలోపు పిల్లలు 2.09 లక్షల మంది ఉన్నారు. వారిలో నులి పురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు. జిల్లాలోని 1,207 అంగన్‌వాడీ కేంద్రాలలో 46,265 మంది చిన్నారులు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 906 ఉండగా వాటిలో 71,405 మంది, 218 ప్రైవేట్ పాఠశాలల్లో 62,777 మంది పిల్లలు ఉన్నారు. బడి బయట 2,183 మంది చిన్నారులు ఉన్నారు. ప్రభుత్వ కళాశాలలు 35 ఉండగా వాటిలో 11,630 మంది, ప్రైవేటు జూనియర్ కాలేజీలు 28 ఉండగా 11,709 మంది ఉన్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా వీటన్నింటిలో కలిపి 2.09 లక్షల మంది 19 ఏళ్ల లోపు పిల్లలు ఉన్నారు. వీరికి అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు, ఆయా పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు గురువారం ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు. ఆరోజు వేసుకోలేక పోయిన వారికి ఈనెల 10న ఇస్తారు. వీరి కోసం మొత్తం 2.93 లక్షల మాత్రలు అందుబాటులో ఉంచారు.

మాత్రల డోసు ఇలా

» 1 నుంచి 2 సంవత్సరాల లోపు చిన్నారులకు సగం (అర) ఆల్బెండజోల్ మాత్రను పొడి చేసి పాల ద్వారా గానీ నీళ్ల ద్వారా గానీ మింగించాలి.

» 2 నుంచి 3 ఏళ్లలోపు పిల్లలకు ఒక మాత్రను పొడి చేసి నీళ్ల ద్వారా మింగించాలి.

» 3 నుంచి 19 ఏళ్లలోపు వారు మాత్రను నమిలి చప్పరించి మంచి నీటితో మింగాలి. » ఇది నేరుగా మింగే మాత్ర కాదు. నోట్లో వేసుకుని చప్పరించినా లేదా నమిలి మింగినా సరిపోతుంది.

తప్పని సరిగా మాత్రలు వేయించండి



1నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పని సరిగా వేయించాలి. ఇవి అన్ని పాఠశాలలు కళాశాలలు, అంగన్ వాడీ కేంద్రాల్లో పిల్లలకు వేస్తారు. బడి బయట ఉన్న పిల్లలకు కూడా ఈమాత్రలను తప్పని సరిగా వేయించాలి. తల్లిదండ్రులు ఈవిషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. మాత్రలు వేయించే విషయంలో వైద్యాఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందికి అందరూ సహకరించాలి.

– డాక్టర్ వెంకటరమణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, సూర్యాపేట

7న తిరుపతిలో ఓబీసీ జాతీయ మహా సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

భానుపురి (సూర్యాపేట) : ఈనెల 7వ తేదీన తిరుపతిలో ఓబీసీ జాతీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్ల మల్ల నరసింహ తెలిపారు. ఓబీసీ మహాసభ వాల్ పోస్టర్‌ను జిల్లా కేంద్రంలో బుధవారం సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ సభలో దేశంలోని 29 రాష్ట్రాల బీసీ ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు తన్నీరు రాంబాబు, గౌరవ అధ్యక్షుడు బైరు వెంకన్న గౌడ్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్రా సంపత్‌నాయుడు, నియోజకవర్గ అధ్యక్షుడు మట్ట రమేష్ యాదవ్, విజయ్‌కృష్ణ, కోడి లింగయ్య, వెంకటేశ్వర్లు, సైదులు, కృష్ణ, జానకి రాముడు పాల్గొన్నారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో అదనపు కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : దేవాదుల ప్రాజెక్టు–6 కాలువల కోసం జిల్లాలో చేపట్టిన భూసేకరణ పనులు వేగవంతం చేయాలి కలెక్టర్ ఎస్ వెంకట్రావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధి కారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు -6 కాలువల కోసం జిల్లాలోని తిరుమలగిరి మండలంలోని తిరుమలగిరి, మాలి పురం, నందాపురం, అనంతారం,తొండగ్రా మాల్లో 204 ఎకరాలు భూమి సేకరించాల్సి ఉందన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేసి భూసేకరణ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ వీరబ్రహ్మచారి, ఇరిగేషన్ ఎస్‌ఈసుధీర్, ఈఈ ప్రవీణ్, తహసీల్దార్ రమణారెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ హేమమాలిని, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ప్రజావాణి ఫిర్యాదుల నమోదు రిజిష్టర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రజావాణిలో పెన్షన్లపై అందిన దరఖాస్తులు, అధికారులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను ఎంపీడీఓలకు పంపించినట్లు డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

బదిలీలపై ఉత్కంఠ

- నేడు కోర్టు తీర్పు కోసం మోడల్ స్కూల్ టీచర్ల ఎదురు చూపు
- ముగిసిన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- గాడితప్పిన బోధన



పసునూర్ మోడల్‌స్కూల్

నాగారం: ఆదర్శ పాఠశాలల (మోడల్ స్కూల్) టీచర్ల బదిలీ ప్రక్రియ ఉత్కంఠ రేకెత్తిస్తోంది. తొలిసారిగా వారి బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ జారీ చేయగా.. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ, కోర్టు కేసులతో ఆప్షన్ల ఎంపిక ఆలస్యమైంది. ఈనెల3న వెలువడే కోర్టు తీర్పుపై బదిలీ ఉత్తర్వుల జారీ ముడి పడి ఉండటంతో.. సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రిన్సిపల్, పీజీటీ, టీజీటీలందరికీ స్థానచలనం కలగనుండటంతో ఆదర్శ పాఠశాలల్లో బోధన గాడితప్పింది.

కేటగిరి	పోస్టులు	దరఖాస్తు చేసుకున్నవారు	ఖాళీలు
ప్రిన్సిపల్	09	03	06
పీజీటీ	135	101	34
టీజీటీ	189	140	46

ఆదర్శలో సందడి

జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో బదిలీల సందడి కనిపిస్తోంది. సూర్యాపేట జిల్లాలోని పసునూర్ (నాగారం), అనంతారం(తిరుమలగిరి), ఆత్మకూర్(ఎస్), ఇమాంపేట (సూర్యాపేట), మునగాల, కర్విరాల(నడిగూడెం), మఠంపల్లి, అనాజిపురం (పెన్‌పహాడ్), గడ్డిపల్లి(గరిడేపల్లి) మొత్తం 9 పాఠశాలలు ఉన్నాయి. ఆరు నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల బోధనకు గాను ప్రిన్సిపల్‌తో సహా పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ) విధులు నిర్వహిస్తున్నారు. వీరి నియామకం నుంచి ఇప్పటివరకు బదిలీలు జరగలేదు. కొత్త జిల్లాలు, జోన్ల ఆవిర్భావం తర్వాత వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఈ నేపథ్యంలో పాత జోన్ల ప్రకారమే బదిలీలకు ప్రభుత్వం ముందుకొచ్చినా సీనియారిటీ, స్పౌజ్ కేటగిరీ విషయమై పలువురు కోర్టు మెట్లు ఎక్కడంతో బదిలీల ప్రక్రియలో ప్రతిష్టంభన నెలకొంది. సీనియారిటీ జాబితా విడుదల చేయడంతో.. అభ్యంతరాల అనంతరం జూలై 23 నుంచి 25వ తేదీ వరకు ఆప్షన్లకు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు బదిలీ ఉత్తర్వులు జారీ కావడమే మిగిలి ఉంది. దాదాపు నెల రోజులుగా బదిలీల ప్రక్రియలో టీచర్లు నిమగ్నం కావడంతో.. విద్యార్థులు చదువులో ఆటంకం ఏర్పడుతోంది. ఎలాగూ బదిలీ అవుతామనే భావనతో టీచర్లు బోధనపైనా దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అందరికీ స్థానచలనం..

జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో ప్రస్తుతం ముగ్గురు ప్రిన్సిపల్స్, పీజీటీలు 101 మంది, టీజీటీలు 36 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ స్థానచలనం కలగనుంది. అన్ని పాఠశాలల్లో టీచర్లు కొత్తవారు రానున్నారు. ఎవరు ఏ పాఠశాలకు బదిలీ అవుతారనేది తేలాల్సి ఉంది.

బదిలీలకు అనుకూలంగా కోర్టు తీర్పు వస్తుంది



మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలపై కోర్టు తీర్పు అనుకూలంగా వస్తుందని ఆశిస్తున్నాం. మోడల్ స్కూల్‌లో నియామకమైనప్పటి నుంచి నేటి వరకు బదిలీలు జరగలేదు. పదేళ్లుగా మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులం బదిలీల కోసం ఎదురు చూస్తున్నాం. కోర్టు కేసును కూడా ప్రభుత్వం పరిష్కరించి, బదిలీలు జరిగేలా చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నాం.

– భూతం యాకమల్లు, రాష్ట్ర అధ్యక్షులు, మోడల్‌స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్.

క్లుప్తంగా

ఉపాధి కోర్సుల్లో శిక్షణ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో మేథా చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో 6 నెలల కాలపరిమితి గల ఎలక్ట్రీషియన్(డొమెస్టిక్), సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్, కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ టెక్నీషియన్, టైలరింగ్ ఎంబ్రాయిడరీ, జర్దోజీ, క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు ఐటీఐ, లేదా డిప్లమా, కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ టెక్నీషియన్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత కల్గి ఉండాలన్నారు. అలాగే టైలరింగ్ ఎంబ్రాయిడరీ, జర్దోజీ, క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుకు మాత్రం 8వ తరగతి పాసైన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు 18నుంచి 25ఏళ్ల లోపు వయస్సు కల్గి ఉండాలని పేర్కొన్నారు. అర్హత కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ ఫొటోలతో ఈ నెల 16న సంస్థలో నిర్వహించే అడ్మిషన్ల కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన వారికి శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పించబడుతుందని తెలిపారు. వివరాలకు 9133908000, 9133908111, 913390 8222 నంబర్లను సంప్రదించాలన్నారు.

గాయపర్చిన వ్యక్తికి జైలు

నిడమనూరు: ముగ్గురిని గాయపర్చిన కేసులో నిందితుడికి నిడమనూరు కోర్టు జడ్జి స్వప్న నెల రోజుల జైలుశిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. తిరిమలగిరి మండలం చింతల పాలెం గ్రామానికి చెందిన జడల కాశయ్య 2017 జనవరి 22వ తేదీన సాయంత్రం పైలాన్ కాలనీకి చెందిన దేశబోయిన ఉష ఇంట్లో దూరి పని మనిషి ఖదిర్‌ను గాయపర్చాడు. అడ్డు కోబోయిన ఉష నుదిటిపై కత్తితో గాయపర్చి వెళ్తుండగా అడ్డుగావచ్చిన మరో పనిమనిషి స్వర్ణలతను సైతం గాయపర్చి పరారయ్యాడు. కాశయ్య చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన కారణంగా దేశబోయిన ఉష ఇంట్లో ఉంటూ పెరిగి పెద్దవాడు కాగా వివాహం జరిపించారు. వేరేగా ఉంటూ అకారణంగా ముగ్గురిని గాయపర్చాడని విజయపురి(టీ) పోలీస్ స్టేషన్‌లో అదే రోజు ఫిర్యాదు ఇవ్వగా అప్పటి ఎస్ఐ గౌరి నాయుడు కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువు కావడంతో నెల రోజుల జైలు శిక్ష అనుభవించాలని లేదా వెయ్యి రూపాయల జరిమానా చెల్లించాలని జడ్జి తీర్పు చెప్పారని కోర్టు లైజన్ ఆఫీసర్ అలీ మహ్మద్ తెలిపారు.

త్వరలో ఆపరేషన్.. అంతలోనే మృత్యువాత

- కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు, బంధువులు
- చౌటుప్పల్ పట్టణంలో విషాదం


నాగేష్ (ఫైల్)

చౌటుప్పల్ : కొద్ది రోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న యువకుడికి అతి త్వరలోనే ఆపరేషన్ జరగాల్సి ఉంది. కానీ అంతలోనే ఆకస్మికంగా మృత్యువాతపడ్డాడు. ఈ హృదయ విదారకర ఘటన బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది. చౌటుప్పల్‌లోని గాంధీపార్కుకు చెందిన బాలగోని నాగేష్(38) స్థానికంగా రిఫ్రిజరేటర్ షాప్ నిర్వహిస్తున్నాడు. నాగేష్‌కు కొద్ది రోజుల క్రితం కిడ్నీ సమస్య తలెత్తింది. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ప్రస్తుతం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. కుమారుడికి కిడ్నీ ఇచ్చేందుకు తల్లి దేవకమ్మ ముందుకు వచ్చింది. అందుకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు సైతం పూర్తయ్యాయి. కిడ్నీ మార్పిడి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత కుటుంబ సభ్యులకు నిమ్స్ ఆస్పత్రి వైద్యులు సైతం సూచించారు. అందులో భాగంగా ఈనెల 10 లేదా 12న ఆపరేషన్ నిర్వహించేందుకు వైద్యులు నిర్ణయించారు. ఆ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక నాగేష్‌కు అకస్మాత్తుగా శ్వాస సంబంధిత ఇబ్బంది తలెత్తింది. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించి ఆక్సిజన్ పెట్టారు. అనంతరం మెరుగైన వైద్య కోసం హైదరాబాద్ తీసుకువెళ్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలో మృతిచెందాడు. త్వరలోనే ఆపరేషన్ జరిగితే సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా మారి కలిసిమెలిసి తమ మధ్య తిరుగుతావనుకుంటే కానరాని లోకాలకు వెళ్లిపోయావా అంటూ భార్యాపిల్లలు, ఇతర కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

సూర్యాపేట రూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సూర్యాపేట, గరిడేపల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన పల్లపు రాజు (25), పస్పుల నాగరాజులు ఇద్దరు కలిసి బైక్‌పై సూర్యాపేటకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. పిల్లలమర్రి స్టేజీ వద్దకు రాగానే సూర్యాపేటలో పని ఉండగా తిరిగి వెళ్లేందుకు పిల్లలమర్రి స్టేజీ వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో రాజు, నాగరాజుకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజును మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సాయిరాం తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని..


ధనుంజయ్(ఫైల్)

గరిడేపల్లి : మిర్యాలగూడకు చెందిన గువ్వ ధనుంజయ్య(53) హుజూర్‌నగర్‌లో ఇరిగేషన్ శాఖ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకొని హుజూర్‌నగర్ నుంచి తన బైక్‌పై మిర్యాలగూడకు వెళ్తున్నాడు. గరిడేపల్లి మండలంలోని అప్పన్నపేట శివారులో కంకర మిల్లు వద్ద చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన కాలపంగు కళ్యాణ్ గరిడేపల్లి నుంచి హుజూర్‌నగర్ వైపు బైక్‌పై వెళ్తూ ధనుంజయ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ధనుంజయ్, కళ్యాణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ధనుంజయ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కళ్యాణ్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వలపు వల వేసి.. రూ.30లక్షలు కాజేసి..!

- ప్రేమ పేరుతో అమాయకుడిని మోసగించిన యువజంట
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
- దంపతుల అరెస్ట్

పాలకవీడు: వ్యసనాలకు బానిసలైన యువ జంట.. ఓ అమాయకుడిని మోసగించి రూ.30 లక్షలు కాజేశారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం గుడుగుంట్లపాలెం గ్రామంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకవీడు మండలం గూడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన సట్టు నారాయణ నేరేడుచర్లకు చెందిన గడ్డం భారతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. నారాయణ క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతుంటాడు. వీరి అవసరాలకు, ఆన్‌లైన్ బెట్టింగులకు డబ్బు అవసరం కావడంతో అదే గ్రామానికి చెందిన దొంగల సతీష్ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మోసానికి తెరలేపారు. నారాయణ తన భార్య భారతిని సంధ్య అనే పేరుతో సతీష్‌కు పరిచయం చేశాడు. మాయమాటలు చెప్పి ప్రేమ పేరుతో సతీష్ వద్ద నుంచి డబ్బులు కాజేయడం మొదలు పెట్టారు. సతీష్‌ను బెదిరించి నాలుగేళ్లుగా సుమారు రూ.30 లక్షలు కాజేశారు. మోసపోయానని గ్రహించిన సతీష్ పోలీసులను ఆశ్రయించాడు. జరిగినదంతా పోలీసులకు వివరించి నారాయణ, భరతిలపై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు బుధవారం వారిని మిర్యాలగూడ వద్ద అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.13వేల నగదు, బైక్ ఇతర సామగ్రి స్వాధీనపరుచుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ లింగయ్య తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్


పోలీసులకు పట్టుబడిన నిందితుల కారు


స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, నగదు

- రెండు కార్లలో మహారాష్ట్రకు సరఫరా
- టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్న పోలీసులు
- అప్పటికే తప్పించుకున్న మరోకారు
- నాలుగు కిలోల గంజాయి, కారు, రూ.15వేల నగదు స్వాధీనం

చౌటుప్పల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరు ప్రాంతం నుంచి మహారాష్ట్రకు గంజాయిని రవాణా చేస్తున్న ఇన్నోవా కారును పోలీసులు పట్టుకున్నారు. మరో కారు తప్పించుకొని పోయింది. ఈ ఘటన మంగళవారం మండల పరిధిలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద చోటు చేసుకుంది. నిందితుల్లో ఒకరు తప్పించుకోగా ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. కేసు వివరాలను సీఐ దేవేందర్ బుధవారం వెల్లడించారు. మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లా పండరిపురం గ్రామానికి చెందిన జావెర్, జాదవ్ అజినాథ్‌తో పాటు అదే జిల్లాకు చెందిన గజిగేట్ ప్రమోద్‌లు వేర్వేరు పనులు చేసుకుంటున్నారు. వివిధ మార్గాల్లో వీరు మిత్రులుగా మారారు. చాలా కాలంగా గంజాయి రవాణా చేస్తున్న జావెర్‌తో కలిసి మిగతా ఇద్దరు కూడా చేతులు కలిపారు. ఆ క్రమంలో సీలేరులోని గంజాయి వ్యాపారుల వద్ద పొడి గంజాయి కొనుగోలు చేశారు. ఒక కారులో 47కిలోలు, మరో కారులో నాలుగు కిలోల చొప్పున ప్యాకెట్‌లుగా చేసి అక్కడి నుంచి బయలుదేరారు. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై రెడ్డిబావి గ్రామ శివారులో తనిఖీలు చేపట్టిన పోలీసులకు ఇన్నోవా కారు చిక్కింది. అందులో నాలుగు కిలోల గంజాయి లభ్యమయ్యింది. అంతకు ముందే 47కిలోల గంజాయి కలిగిన కారు తప్పించుకుపోయింది. ఇన్నోవా కారులో ఉన్న ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రెండు ఫోన్లు, 15వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిని కోర్టులో హాజరుపరిచారు. పట్టుబడిన సొత్తు విలువ 8లక్షల వరకు ఉంటుందని సీఐ తెలిపారు.

ఆలయంలో బంగారు ఆభరణం పోగొట్టుకున్న భక్తుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి బుధవారం వచ్చిన ఓ భక్తుడు తన చేతికున్న బ్రాస్లెట్‌ను ఆలయంలో పోగొట్టుకున్నాడు. కరీంనగర్ జిల్లా కమలాపూర్‌కు చెందిన లింగమూర్తి తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకునేందుకు సాయంత్రం ఆలయానికి వచ్చాడు. సుమారు సాయంత్రం 5.30గంటల సమయంలో స్వామివారిని దర్శనం చేసుకొని, ముఖ మండపంలో అష్టోత్తర పూజల్లో పాల్గొనేందుకు వెళ్లాడు. అప్పటి వరకు చేతికి ఉన్న సుమారు రెండున్నర తులాల బంగారు బ్రాస్లెట్ కనిపించలేదు. దీంతో అక్కడే ఉన్న ఆలయ, ఎస్పీఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే దర్శనం క్యూలైన్ నిలిపివేసి, దర్శనానికి వచ్చిన భక్తులను క్యూలైన్‌లోనే ఎస్పీఎఫ్ పోలీసులు తనిఖీలు చేశారు. క్యూలైన్‌లో, ముఖ మండపంలో ఎక్కడ బ్రాస్లెట్ కనిపించకపోవడంతో వెంటనే భక్తుడు లింగమూర్తి, కుటుంబ సభ్యులు కొండపైనే గల కమాండో కంట్రోల్ గది వద్దకు వెళ్లి పోలీసుల సహకారంతో సీసీ ఫుటేజీలో పరిశీలిస్తున్నారు. భక్తుడు ఎస్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీసీ ఫుటేజీ తీసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గత నెల 28, 29వ తేదీల సీసీటీవీ ఫుటేజీలను ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ అహ్మద్ సేకరించి తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత సహ కార్యదర్శి తోట భానుప్రసాద్ , మందిర అర్చక ప్రముఖ మదన్మోహన్‌లు అన్నారు. సీసీ ఫుటేజీ బయటకు తీసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం యాదగిరిగుట్ట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీసీ ఫుటేజీ బయటకు వచ్చిన సంఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో కర్రె ప్రవీణ్ చామ రవీందర్, కంసాని హరీష్ ఉన్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రామగిరి(నల్లగొండ), చండూరు : ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి యువతిని మోసగించిన యువకుడికి మహిళా కోర్టు జడ్జి బి.తిరుపతి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చండూరు మండల కస్తాల గ్రామానికి చెందిన ఓ యువతికి తల్లి లేకపోవడంతో అదే గ్రామంలో ఉంటున్న పెద్దమ్మ పెదనాన్నలు బొమ్మనబోయిన మల్లయ్య, జయమ్మ వద్ద ఉంటూ చదువుకుంటోంది. వీరి ఇంటి పక్కనే ఉంటున్న గంటా శంకర్ మర్రిగూడ మండలం వాయిలపల్లిలో మెడికల్ షాపు నడుపుతున్నాడు. ఏడాది కాలంగా స్నేహంగా ఉంటూ యువతితో పరిచయం పెంచుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని చెబుతూ తరచూ వెంట పడ్డాడు. ఇదే క్రమంలో యువతికి సిమ్ కార్డు ఇచ్చి రోజు ఫోన్‌లో మాట్లాతుండేవాడు. కొన్ని రోజుల తర్వాత యువతికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారని విషయం శంకర్‌కు తెలిసింది. నన్ను కాదని వేరే వాళ్లని వివాహం చేసుకుంటే నీ అంతు చూస్తానని బెదిరించాడు. 2016 జూలై 11న ఫోన్ చేసి ఇంట్లో ఎవరికి తెలియయుండా పెళ్లి చేసుకుందామని చెప్పి తన వాయిలపల్లిలోని అద్దె గదికి తీసుకెళ్లాడు. శారీరకంగా దగ్గరవడానికి ఒత్తిడి చేశాడు. యువతి అంగీకరించకపోవడంతో బెదిరించి లోబర్చుకున్నాడు. రెండు రోజులు గదిలో నిర్బంధించి భయభ్రాంతులకు గురి చేయడమే కాకుండా మానసికంగా చిత్ర హింసలకు గురి చేశాడు. పెళ్లి చేసుకోవాలని యువతి ఒత్తిడి చేయగా ఇద్దరు కలిసి బైక్‌పై దర్వేశిపురానికి బయలుదేరారు. మార్గ మధ్యలో బైక్ నుంచి కింద పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ విషయంలో శంకర్ కుటుంబ సభ్యులకు తెలియడంతో ఇద్దరిని ఇంటికి తీసుకెళ్లారు. రెండు రోజుల తర్వాత శంకర్ కుటుంబ సభ్యులంతా యువతిని పెద్దమ్మ ఇంట్లో వదిలేసి వెళ్లిపోయారు. యువతి చండూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన అప్పటి సీఐ పి.రమేష్ కుమార్, ఎస్ఐ సురేష్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటమరణారెడ్డి వాదనలతో ఏకీభవించిన మహిళా కోర్టు జడ్జి బి.తిరుపతి అత్యాచారానికి పాల్పడినందుకు సెక్షన్ 376 ప్రకారం పదేళ్ల జైలు రూ. 10 వేల జరిమానా, గదిలో నిర్బంధించినందుకు గాను సెక్షన్ 342 కింద ఏడాది జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య



యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

యాదగిరిగుట్ట: రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం భవనంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 8కోట్ల మంది రవాణా రంగంలో పనిచేస్తున్నారని, అందులో కొంతమంది నిత్యం ప్రమాదాలకు గురవుతూ చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 సంవత్సరంలో 1.54లక్షల మంది, గంటకు 17మంది చొప్పున కార్మికులు రోడ్డు ప్రమాదంలో చనిపోయారని తెలిపారు. ప్రమాదంలో మరణిస్తున్న కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన మోటార్ వాహన చట్టం –2019 కార్మికులకు తీవ్ర నష్టం చేసే విధంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని ఉపసంహరించే వరకు కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల కోసం భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. యూనియన్ కేంద్ర కమిటీ సభ్యుడు కల్లూరి మల్లేశం అధ్యక్షత వహించిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ , రాష్ట్ర కోశాధికారి సతీష్, రాష్ట్ర ఉపాధ్యాక్షులు అజయ్ బాబు, రుద్ర కుమార్, కోటయ్య, రాంబాబు, నాయకులు పున్నం రవి, సీహెచ్ రవికుమార్, విజేందర్, యండి పాషా, కువకుమారస్వామి, గోవర్ధన్, రాజమౌళి, నాగరాజు, శ్రీనివాస్, రాములు తదితరులున్నారు.

అప్పుల బాధతో లారీ డ్రైవర్ ఆత్మహత్య


వెంకటయ్య(ఫైల్)

సంస్థాన్ నారాయణపురం: లారీల ఈఎంఐలు చెల్లించలేక, చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపంతో ఓ లారీ డ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సంస్థాన్ నారాయణపురం మండలం నాగవారిగూడెంలో బుధవారం చోటుచేసుకుంది. కుంటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగవారిగూడెం గ్రామానికి చెందిన మేకల వెంకటయ్య(40) లారీ డ్రైవర్‌గా పనిచూస్తూ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. వెంకటయ్య మూడేళ్ల క్రితం మూడు లారీలు కొనుగోలు చేశాడు. లారీలకు కిరాయిలు దొరకవడంతో ఈఎంఐలు కట్టాడానికి సుమారు రూ.15లక్షల వరకు అప్పులు చేశాడు. పెండింగ్ ఈఎంఐలు కట్టడానికి డబ్బులు లేకపోవడం, అప్పులు ఇచ్చిన వారు తిరిగి అడుగుతుండటంతో వెంకటయ్య తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం భార్య నవ్యకు లారీ దిగబడింది అని చెప్పి రాత్రి 10:30లకు హైదారాబాద్‌లో ఇంటి నుంచి వెళ్లాడు. బుధవారం నాగవారిగూడెంలోని వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లుగా కుంటుంబ సభ్యులు గుర్తించారు. మృతుడికి భార్యతో పాటు బాబు, పాప ఉన్నారు. వెంకటయ్య భార్య నవ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాఘవేంద్ర కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారిని బలిగొన్న నీటి సంపు


చిన్నారి సుమిత్ర మృతదేహం

భూదాన్‌పోచంపల్లి : ప్రమాదవశాత్తు నీటి సంప్‌లో పడి ఓ చిన్నారి మృతి చెందింది.ఈ ఘటన భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సంబా సింబు కుటుంబం ఉపాధి కోసం నెల రోజుల క్రితం దోతిగూడెం వచ్చారు. స్థానికంగా మోహన్‌రెడ్డికి చెందిన షెడ్‌లో తాత్కాలిక నివాసం ఉంటూ రోజువారీ కూలీ పనులకు వెళ్తుంటారు. బుధవారం సాయంత్రం సింబు కుమార్తె సుమిత్ర (5) ఆరుబయట ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి సంప్‌లో పడిపోయింది. కొద్దిసేపటి తర్వాత కుమార్తె కన్పించడంలేదని తల్లిదండ్రులు వెదకగా నీటి సంప్‌లో పడి చనిపోయి ఉంది. వెంటనే మృతదేహాన్ని బయటికి తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోస్ట్‌మార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

బార్‌లో దొంగతనం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పరిధిలోని యాదాద్రి బార్‌లో దొంగతనం జరిగింది. బార్ నిర్వాహకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి 11గంటల సమయంలో పట్టణంలో నిర్వహిస్తున్న బార్‌ను నిర్వాహకులు మూసి ఇంటికి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం వచ్చి బార్‌ను తిరిగి ఓపెన్ చేయగా కౌంటర్ తీసి, అందులో ఉన్న డబ్బులు దొంగిలించినట్లు కనిపించింది. అనుమానం వచ్చిన నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చి, బార్‌లో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించారు. గతంలో బార్‌లో పని చేసిన ఓ వ్యక్తి దొంగతనం చేసినట్లు నిర్ధారణ అయింది. కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.35వేలకు పైగా నగదును అపహరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని సీఐ రమేష్ తెలిపారు.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి

డిండి: ఘర్షణలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. డిండి మండల పరిధిలోని ఢాక్యాతండాకు చెందిన నేనావత్ కృష్ణ(55) ఇంట్లో మంగళవారం సాయంత్రం ఫోన్ చోరీకి గురైంది. తన ఫోన్‌ను అదే తండాకు చెందిన శ్రీను దొంగిలించాడన్న అనుమానంతో కృష్ణ అతడితో గొడవకు దిగాడు. ఇదే క్రమంలో మాటామాటా పెరగగంతో ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణలో సీసీ రోడ్డుపై పడిన కృష్ణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే రాత్రి అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసామని సీఐ సురేష్ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.సైదులు తెలిపారు. మృతుడి అంత్యక్రియల సమయంలో తండాలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గంజాయి కేసులో నిందితుడిపై పీడీయాక్టు

సూర్యాపేట క్రైం : మహారాష్ట్రకు చెందిన రాబిన్ సన్ ఫెర్నాండీస్‌గంజాయి సరఫరా, రవాణా చేస్తుండగా పోలీసులు గుర్తించారు. నిందితుడు పారిపోతుండగా వెంబడించిన మునగాల పోలీసు సిబ్బంది రాబిన్‌సన్ ఫెర్నాండీస్‌ను అదుపులోకి తీసుకొని 120కేజీల గంజాయిని సీజ్ చేసి అరెస్టు చేసినట్లు ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. నిందితుడు మళ్లీ ఇంలాంటి నేరానికి పాల్పడవద్దని ఉద్దేశంతో అతనిపై పీడీ యాక్టు అమలు చేసి జైలుకు తరలించినట్లు తెలిపారు. పీడీ యాక్టు నమోదైన నిందితుడిని మునగాల సర్కిల్ సీఐ రాఘవులు ఆధ్వర్యంలో ఎస్ఐ లోకేష్, సిబ్బంది హైదరాబాద్‌లోని చంచల్‌గూడ సెంట్రల్ జైల్‌లో అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

ఎలికట్టెలో ప్రైవేట్ పాఠశాల వాహనాల అడ్డగింత

- తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని గ్రామస్తుల నిర్ణయం


ఎలికట్టెలో ప్రైవేట్ పాఠశాల వాహనాలను అడ్డగిస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

చిట్యాల: విద్యార్థులంతా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని కోరుతూ చిట్యాల మండలం ఎలికట్టె గ్రామవాసులు, పలువురు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల వాహనాలను అడ్డగించారు. ఎలికట్టె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 34, ప్రాథమిక పాఠశాలలో 40మందికి పైగా విద్యార్థులున్నారు. దీంతో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలను ఎత్తివేసే పరిస్థితి నెలకొనడంతో ఆ గ్రామ సర్పంచ్ ఉయ్యాల సత్తయ్యగౌడ్, ఎంపీటీసీ గొలను గోండ దశరథ ఆధ్వర్యంలో గ్రామస్తులు, ప్రస్తుతం ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులంతా గ్రామంలోని విద్యార్థులను తీసుకెళ్లే ప్రైవేట్ పాఠశాల వాహనాలను అడ్డుకున్నారు. విద్యార్థులందరినీ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని కోరారు. గురువారం గ్రామస్తులంతా సమావేశమై గ్రామంలోని పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలి



ఎలికట్టె గ్రామంలో అన్ని వసతులతో కూడిన జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలున్నాయి. రెండు పాఠశాలల్లో కలిపి ఎనభై మంది విద్యార్థులు ఉన్నారు. గ్రామంలోని మరో వంద మందికిపైగా విద్యార్థులు చిట్యాలలోని ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్నారు. దీంతో గ్రామంలో అన్ని వసతులున్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతే ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేసే పరిస్థితి ఉంటుంది. ఇలా జరిగితే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పేదరికం కారణంగా విద్యకు దూరమయ్యే అవకాశం ఉంది.

– గొలనుగొండ దశరథ, ఎంపీటీసీ, ఎలికట్టె

పత్తి పంటలో తెగుళ్లు.. పోషకాల యాజమాన్యం

- కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు సూచనలు

పాడి పంట


సూక్ష్మదాతు లోపంతో పండు ఆకు తెగులు ఆశించి ఎర్రబారిన పత్తి మొక్కలు


డాక్టర్ శ్రీనివాసరావు

త్రిపురారం : పంట మార్పిడి చేయకుండా ఏళ్ల తరబడి పత్తి సాగు చేస్తే పంటకు జింకు, మెగ్నీషియం వంటి సూక్ష్మ పోషకాల లోపం కనిపిస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొంటున్నారు. రైతులు నిర్లక్ష్యం చేయకుండా పత్తి పంటలో తెగుళ్ల ఆశించకుండా పోషకాల యాజమాన్య చర్యలు సకాలంలో చేపట్టాలని సూచిస్తున్నారు.

తెగుళ్ల లక్షణాలు, నివారణ చర్యలు

జింక్ లోపం : జింక్ లోపం సోకిన పత్తి పంటలో మొక్కల ఆకులు పసుపు పచ్చ రంగులోకి మారుతాయి. ఆకులు చిన్నవిగా ముడతలు పడి కణువుల మధ్య దూరం తగ్గుతుంది. మొక్కలు గిడసబారిపోతాయి. దీని నివారణకు 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి ప్రతి 5 రోజులకు రెండు లేదా మూడు సార్లు పిచికారీ చేసుకోవాలి. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఎకరానికి 20కిలోల జింక్ సల్ఫేట్‌ను భూమిలో వేసి కలియదున్నాలి.

పారా నిల్బు లక్షణాలు : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జిల్లాలో అక్కడక్కడ పత్తి పంటలో పారా నిల్బు లక్షణాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తించారు. దీని వల్ల మొక్కలకు పోషకాలు సరిగా అందక సడలిపోయి (ఎండిపోయి) చనిపోతున్నాయి. దీని ద్వారా మొక్కలు సాంద్రత తగ్గి దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుంది. దీని నివారణకు అంతర కృషి చేపట్టి మద్దతుగా హెక్టారుకు 25కేజీ యూరియా, పొటాష్ 10 కేజీల చొప్పున అందించి మొక్కలను కాపాడుకోవాలి. పంటల సాగులో వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించాలి.

మెగ్నీషియం లోపం

మెగ్నీషియం దాతువు లోపంతో ముదురు ఆకుల అంచులు పసుపు రంగుగా మారుతాయి. తరువాత ఆకులు ఎర్రబడి రాలిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున మెగ్నీషియం సల్ఫేట్‌ను కలిపి పైరుపై వారం పది రోజుల వ్యవధిలో 2సార్లు పిచికారీ చేయాలి.